అభ్యుదయవాది బసవేశ్వరుడు

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

బసవేశ్వరుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, మే 10: లింగవివక్షను వ్యతిరేకించిన అభ్యుదయవాది బసవేశ్వరుడని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం బసవేశ్వర జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్‌లోని పద్మావతి కాలనీ గ్రీన్‌బెల్ట్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో నాటి పాలకులు మరిచినా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వంలో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వరుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, జయంతిని అధికారికంగా నిర్వహించామని చెప్పారు. అన్ని కులాలకు సమాంతరంగా మహానీయుల పేర్లపై హైదరాబాద్ కోకాపేట్‌లో రూ.100 కోట్ల విలువైన భూములను కేటాయించామని తెలిపారు. వీరశైవ లింగాయత్‌లను కేసీఆర్ ప్రభుత్వంలో కడుపునపెట్టి చూసుకున్నామని, ఇప్పుడు మీరు బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికిషన్, గంజి వెంకన్న, అనంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

భూత్పూర్‌లో..

భూత్పూర్, మే 10 : పట్టణంలో వీరశైవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బసవేశ్వరుడి జయంతిని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

హిందూపూర్‌లో పూజలు

కృష్ణ, మే 10 : మండల కేంద్రంతో పాటు పలుగ్రామాల్లో బసవేశ్వర జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా హిందూపూర్‌లో స్వామీజీ నేరడ్గమ్ పీఠాధిపతి సిద్ధిలింగస్వామి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ నేత రాజుల ఆశిరెడ్డి, నాయకుల ఆధ్వర్యంలో బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నివాళులర్పించిన డీకే అరుణ

మహబూబ్‌నగర్ అర్బన్ మే 10: కుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త బసవేశ్వరుడని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పద్మావతికాలనీ గ్రీన్‌బెల్ట్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జడ్చర్లలో..

జడ్చర్ల, మే 10: బసవ జయంతిని జడ్చర్లలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొని, పూజలు నిర్వహించి, ఘన నివాళులర్పించారు. రాష్ట్ర సంగీతనాటక అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్ మాట్లాడుతూ బసవేశ్వరుడు అక్షరాస్యత అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు.

బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో..

నారాయణపేట టౌన్, మే 10: బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో శుక్రవారం బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి కృష్ణమాచారి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా బసవ జయంతి

మరికల్, మే 10: మరికల్, ధన్వాడలో వీరశైవలింగాయత్ సంఘం బసవ జయంతి నిర్వహించారు. గ్రామ పంచాయతీ, తాసీల్దార్ కార్యాలయం వద్ద అధికారికంగా నిర్వహించారు.

బసవేశ్వరుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మోసకారి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ పేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి

మరికల్, మే 10: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని నారాయణ పేట మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పుసల్‌పాడ్‌లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతంలో కేసీఆర్ అందించిన సంక్షేమ పథకాలు ఇవ్వడానికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి కావడం లేదన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించాలని, కారు గుర్తుకు ఓటు వెసి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విష్ణుకాంత్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సురేందర్, రాజేశ్వర్ రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బల్క్ మెసేజ్‌లపై నిషేధం

నారాయణపేట, మే 10: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు 48గంటల ముందు నుంచి బల్క్ మెసేజ్‌లు పంపడంపై నిషేధం అమలులో ఉంటుందని కలెక్టర్ శ్రీహర్ష శుక్రవారం ప్రకటనలో తెలిపారులు. సైలెన్స్ పీరియడ్‌లో భాగంగా 11న శనివారం సాయంత్రం 6గంటల నుంచి 13న సోమవారం సాయంత్రం 6గంటల వరకు అభ్యంతరకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్‌లపై ఎన్నికల సంఘం నిషేధం విధించిందని తెలిపారు.

కాంగ్రెస్ అంటేనే బోగస్

- హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు ఓటేయొద్దు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

మిడ్జిల్, మే 10: తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీలు నెరవేర్చకుండా ఓట్లు ఎలా అడుగుతారని బీఆర్ఎస్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ నాయకులకు ఓటు వేయొద్దని ఓటర్లకు చెప్పారు. వారికి బుద్ధి చెప్పేందుకు బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షోలో పాల్గొని మాట్లాడారు. రైతుబంధు రాలేదు, రుణమాఫీ లేదు, ఆడపిల్ల పెళ్లికి తులం బంగారం లేదు. ఒక్క హామీని కూడా అమలు చేయని సీఎం రేవంత్‌రెడ్డిని మళ్లీ న మ్మొదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాండు, ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ శశిరేఖబాలు, పీఏసీసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సుధాబాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, శేఖర్, వెంకట్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బీంరాజు, బం గారు, జగన్‌గౌడ్ ఉన్నారు.

సర్కార్‌వి గ్యారెంటీ లేని హామీలు

- మాజీ ఎమ్మెల్యే ఆల, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి పల్లె రవికుమార్

మాట్లాడుతున్న రవికుమార్, చిత్రంలో ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర, మే 10 : కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు గ్యారెంటీలేనివని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకద్రలో నిర్వహించిన రోడ్‌షోలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి పల్లె రవికుమార్‌గౌడ్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిందన్నారు. పదేండ్ల కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్ర అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకొని, నేడు దేవుడి పేరుతో ఓట్లు అడుక్కుంటున్నదన్నారు. మోదీ అందరికీ అచ్చేదిన్ వస్తుందని పదేండ్ల నుంచి చెబుతున్నారని, అచ్చేదిన్ కాదు సచ్చేదిన్ వచ్చిందని ఎద్దేవా చేశారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం ఉండాలన్నా, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాలన్నా బీఆర్ఎస్ అ భ్యర్థులు ఎంపీలుగా ఉండాలన్నారు. అందుకే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించుకుందాం

పాలమూరు, మే 10: మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూర్, ఇప్పలపల్లి, కోటకదిర, మాచన్‌పల్లి, పోతన్‌పల్లి, రాంచంద్రపూర్, ధర్మాపూర్, మాచన్‌పల్లితండా, జమిస్తాపూర్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలించాలని గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మాజీ సర్పంచులు రాంచంద్రయ్య, శ్రీకాంత్‌గౌడ్, రాణెమ్మ, వెంకటయ్య, సత్యమ్మ, మల్లురమ్మ, మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు, రాఘవేందర్‌గౌడ్, మస్తాన్ పాల్గొన్నారు.

అడ్డాకుల మండలంలో..

మూసాపేట(అడ్డాకుల), మే 10 : అడ్డాకులతోపాటు కాటరవం గ్రామంలో అడ్డాకుల జెడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని ఉపాధి కూలీలను కలిసి అభ్యర్థించారు.

మూసాపేట మండలంలో..

మూసాపేట, మే 10 : మండలంలోని అచ్చాయిపల్లి, నిజాలాపూర్ తదితర గ్రామాల్లో జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్ శుక్రవారం బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. అచ్చాయిపల్లి, చక్రాపూర్‌లో ఉపాధి కూలీలను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో యూత్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ రఘురాములు, బాలన్న, యాదయ్య, మల్లేశ్, రాజు పాల్గొన్నారు.

దేవరకద్రలో..

దేవరకద్ర, మే 10 : మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. జీన్గురాల ఎంపీటీసీ తిరుపతయ్య, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి ఇంటింటికీ తిరిగి మన్నెకు ఓటేయాలని అభ్యర్థించారు.

భూత్పూర్ మండలంలో..

భూత్పూర్, మే 10 : మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ శుక్రవారం ప్రచారం చేశారు. కొత్తూర్‌లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్, మాజీ సర్పంచులు నారాయణగౌడ్, నర్సింహాగౌడ్, సత్యనారాయణ, వెంకట్రాములు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు

ఊట్కూర్, మే 10: కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దని మాజీ జెడ్పీటీసీ అరవిందకుమార్ అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, యువజన విభాగం మండల అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, తరుణ్, నరేశ్, ప్రేమ్ సుధాకర్, శివారెడ్డి, ఆసిఫ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు పథకాలు

రాజాపూర్, మే 10: కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దని డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా తిర్మలాపూర్, నర్సంపల్లితండాలో నమూనా బ్యాలెట్ బాక్స్‌తో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో యూత్‌వింగ్ మండల అధ్యక్షుడు వెంకటేశ్, మాజీ సర్పంచులు రామకృష్ణాగౌడ్, మహిపాల్‌రెడ్డి, పుల్లారెడ్డి, చంద్రయ్య, విష్ణు, నర్సింహులు, శ్రీనివాస్, రవి, సత్యం పాల్గొన్నారు.

ఊట్కూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

కోస్గి, మే 10 : బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డిని గెలిపించాలని కోస్గి మండలంలో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం కోస్గిలోని సర్జఖాన్‌పేట్‌లో కొడంగల్ ఎన్నికల ఇన్‌చార్జి , మాజీ స్పోర్ట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ శాసం రామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజు, మధు, బాలరాజు గౌడ్, ఇవ్వయ్య, శ్రీనివాస్, రాములు, అంజి ఉన్నారు.

గ్యారెంటీల పేరుతో మోసం

- మహబూబ్‌నగర్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ

నారాయణపేట టౌన్, మే 10: గ్యారెంటీల పేరుతో ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు వస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను తరిమికొట్టాలని మహబూబ్‌నగర్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహించిన జనసభలో ఆమె మాట్లాడారు. పాలమూరులో కమలం పార్టీ గెలిస్తే నరేంద్రమోదీ ఆశీస్సులతో పాలమూరు అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి మహిళలు, ప్రజలు అంటే గౌరవం లేదన్నారు. రాష్ట్రాన్ని మోసం చేస్తున్న దోకేబాస్ రేవంత్‌రెడ్డి అని, ఓటుకు నోటు కేసులో జైలుకు వెళ్లిన దొంగ అని విమర్శించారు. మహిళలు, రైతులు, యువకులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలను అభివృద్ధి పథంలో తీసుకు వెళ్లాలన్న లక్ష్యంతో ప్రధాని పనిచేస్తున్నారని అన్నారు.

అరుణమ్మను గెలిపించాలి

మరికల్, మే 10: పార్లమెంట్ ఎన్నికల్లో పాలమూరు బీజేపీ అభ్యర్థి డీ.కే అరుణమ్మను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నర్సన్‌గౌడ్ శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమం లో నాయకులు రాజేశ్, వేణుగోపాల్, వెంకటేశ్, రమేశ్ మోహన్‌రెడ్డి, నిఖిల్, నరేశ్, చెన్నయ్య, నర్సింహులు, ఆనంద్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఆర్ఎన్ఆర్ రూ.2,317

జడ్చర్ల, మే 10: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం అత్యధికంగా క్వింటా రూ.2,317ధర పలికింది. కనిష్ఠంగా రూ. 1,900 మధ్యస్థంగా రూ.2,000 పలికింది. మొత్తం 3, 280క్వింటాళ్లు రైతులు తెచ్చారు. అలాగే మార్కెట్‌కు 70క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా, క్వింటా గరిష్ఠంగా రూ.6,831, కనిష్ఠంగా రూ. 5,161, మధ్యస్తంగా రూ.5,870 ధర పలికింది. 7క్వింటాళ్ల ఆముదాలు అమ్మకానికి రాగా, క్వింటా గరిష్ఠంగా రూ. 5,521 లభించింది. 895 క్వింటాళ్ల మొక్కజొన్నలు అమ్మకానికి రాగా, క్వింటా గరిష్ఠంగా రూ.2,267ధర పలికింది.

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

- సాధారణ ఎన్నికల అధికారి షెవంగ్‌గ్యాచో భూటియా

మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి రవినాయక్

మహబూబ్‌నగర్ అర్బన్, మే 10: పార్లమెంట్ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలని సాధారణ ఎన్నికల అధికారి షెవంగ్‌గ్యాచో భూటియా అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో వ్యయ పరిశీలకులు వరుణ్‌రంగస్వామి, రిటర్నింగ్ అధికారి రవినాయక్ వెబెక్స్ ద్వారా పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల అధికారులు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని సూచించారు.

పోలింగ్‌కు సిద్ధంగా ఉండాలి..

పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుంచి ఎన్నికలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

పోలింగ్ ప్రక్రియ సజావుగా చేపట్టాలి

నారాయణపేట టౌన్, మే 10 : ఈనెల 13న పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్, పోల్ పర్సంటేజ్, రిసెప్షన్‌లపై సెక్టోరియల్ అధికారులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు లేకుండా, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ రోజు ఉదయం 5.30గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభం అయ్యేలా చూడాలన్నారు. ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తితే సెక్టోరియల్ అధికారులు వెంటనే స్పందించి, రిజర్వులో ఉంచిన యూనిట్లను సమకూర్చాలన్నారు. పోలింగ్ ముగిశాక ఈవీఎంలు స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచే వరకు సెక్టోరియల్ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు.

మిడ్జిల్‌లో ఈదురుగాలులతో భారీ వర్షం

- తడిసిన ధాన్యం.. రైతన్నలు ఆందోళన

మిడ్జిల్‌లో కురుస్తున్న వర్షం

మిడ్జిల్, మే 10: మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు వర్షం కురవడంతో సేద తీరారు. దీంతో సాయంత్రం వాతావరణం చల్లగా మారింది. మిడ్జిల్‌తోపాటు కొత్తూర్, మసిగుండ్లపల్లి, బోయిన్‌పల్లి, వాడ్యాల్, వేముల తదితర గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మామిడి కాయలు నేలరాలాయి. అక్కడక్కడ రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఇబ్బందిపడ్డారు.

అక్షింతలు కాదు.. అభివృద్ధిని చూసి ఓటేయాలి

- ఎక్సైజ్, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

మందిపల్లిలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ధన్వాడ, మే 10: దేవుని పేరుతో, అక్షింతల పేరుతో ఓట్లు అడుగుతున్నారని, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని మందిపల్లిలో కార్నర్ సమావేశం నిర్వహించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, శేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరహరి, నర్సింహారెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయాలి

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ, మే 10 : ఓటర్లు ఆవేశంతో కాదు.. ఆలోచనతో ఓటు వేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని టంకర, కోత్తపేట, బుద్దారం, కారంతండా గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు మహేందర్, నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోడ్ ముగిసిన వెంటనే హామీల అమలు..

మహబూబ్‌నగర్ అర్బన్, మే 10: ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. పాలమూరు ప్రజల తీర్పు సీఎం రేవంత్‌రెడ్డి గౌరవం పెంచేలా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలు పాలమూరు అభివృద్ధికి బాటలు వేస్తాయన్నారు. తనపై నమ్మకం ఉంచి గెలిపించాలని అభ్యర్థించారు.

మీ కరెంట్ బిల్లు నేను కడతా

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



రాజాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్, మే 10: మండలంలోని ప్రజలు కరెంట్ బిల్లు చెల్లించవద్దని, ఎవరైనా బిల్లు కోసం ఇంటికి వస్తే ఎమ్మెల్యే కడతాడని చెప్పాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు లంచం ఇవ్వొద్దని చెప్పారు. వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కృష్ణయ్య, నరహరి, రమేశ్, నర్సింహులు, యాదయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బసవేశ్వరుడు విశ్వగురువు

పాలమూరు, మే 10: పాలమూరు విశ్వవిద్యాలయంలో శుక్రవారం బసవేశ్వరుని జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ హాజరై మాట్లాడారు. బసవేశ్వరుడు విశ్వగురువు అని, ఆయన బోధనలు ప్రపంచానికి మార్గదర్శకమన్నారు. అనంతరం ముఖ్యవక్త డా.చంద్రయ్య మాట్లాడుతూ దేహమే దేవాలయం అని, మొదటి కులాంతర వివాహం చేశారని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, కన్వీనర్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే మైక్రోబయాలజీ విభాగంలో వివిధ అంశాల్లో పీజీ పట్టాలను అందుకున్న విద్యార్థులను వీసీ అభినందించారు.

ఓటు అమ్ముకుంటే శవంతో సమానం

పాలమూరు, మే 10: డబ్బుకు ఓటు అమ్ముకుంటే బతికున్నా శవంతో సమానమని జిల్లా జైహూ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మేశ్వరన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని లుంబిని పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో రాజకీయ నాయకులు చూపే డబ్బు ఎరకు ఆశపడితే మరో ఐదేళ్లు మోసపోవడం ఖాయమని, పార్టీలతో సంబంధం లేకుండా పోటీచేసే అభ్యర్థుల నైతికవర్తన, అర్హత, నిబద్ధత, సమర్థత చూసి అభ్యర్థిని ఎన్నుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ ధన ప్రవాహం వెల్లువలా ప్రవహిస్తున్న ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ ద్వారా పేదవర్గాలు చట్టసభల్లోకి అడుగు పెట్టలేవని అన్నారు. అనంతరం ఓటును అమ్ముకుంటే శవంతో సమానం అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జైహూ జిల్లా అధ్యక్షుడు, జస్ట్ వోట్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ముంతాజ్‌ఇమ్మామ్, శాంత, సింధు, మరియంసారా, జలాలుద్దీన్, రాజు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

నాగర్‌కర్నూల్, మే 10: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చోరీలకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. శుక్రవారం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించి వివరాలను వెల్లడించారు. ఈనెల 4వ తేదీన తిమ్మాజిపేట మండలం గొరిటలో జరిగిన చోరీ ఘటనపై గురువారం జడ్చర్లలోని ఎర్రసత్యం కాలనీకి చెందిన బొంతల మూర్తిని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకొని అతడి నుంచి 84 గ్రాముల బంగారు, 80 తులాల వెండి ఆభరణాలు, ఒక పల్సర్ బైక్ (టీఎస్ 07HZ 9833), రూ.లక్షా 50వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు ఉమ్మడి జిల్లాలోని షాద్‌నగర్